ఎరువుల నిల్వలపై నిఘా

- స్టాక్ వివరాలు తెలుసుకునేందుకు ఎఫ్ఐవీఎస్ యాప్ రూపకల్పన
- సీజన్ ముగిసే వరకు దుకాణాల్లోని నిల్వల వివరాల నమోదు
- కృత్రిమ కొరతను నివారించేందుకే అంటున్న వ్యవసాయ అధికారులు

కేతేపల్లి: మృగశిర కార్తె ప్రవేశించడంతో రైతులు వానాకాలం సాగు పనులు ముమ్మరం చేశారు. ఎరువుల కొరత ఏర్పడుతుందనే కారణంతో కొంత మంది రైతులు ముందస్తుగానే కొనుగోలు చేసి నిల్వ చేసుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల నిల్వలు కచ్చితంగా తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం(ఎఫ్ఐవీఎస్) యాప్‌ను రూపొందించింది. దీనిలో భాగంగా వ్యవసాయ అధికారులు సీజన్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఫర్టిలైజర్ దుకాణాలు, సింగిల్‌విండో కార్యాలయాల్లో తనిఖీలు చేస్తూ యాప్‌లో సంబంధిత ఎరువుల వివరాలు నమోదు చేస్తున్నారు.



తుంగతుర్తిలోని ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌లు పరిశీలిస్తున్న అధికారులు

వివరాలు పక్కాగా..

కేతేపల్లి మండలంలోని ఎరువుల దుకాణాల తనిఖీ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు వారం నుంచి ప్రారంభించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 15 వరకు ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. మండల వ్యవసాయ అధికారులు అన్ని ఎరువుల దుకాణాల్లో ఒక పర్యాయం తనిఖీలు పూర్తి చేశారు. ప్రతి వారంలో రెండు పర్యాయాలు తప్పనిసరిగా ఏఓ, ఏడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేయాలి. ఈ సందర్భంగా దుకాణాల్లో పాయింట్ ఆఫ్‌సేల్(పీఓఎస్) యంత్రాలు వినియోగిస్తున్నారా? లేదా? అనే వివరాలు తెలుసుకోవాలి. స్టాక్ రిజిస్టర్‌లో సంతకాలు చేసిన తర్వాత ఎరువుల వివరాలను పరిశీలించి ఎరువుల నిల్వ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీని ద్వారా పంట సాగుకు రైతులకు ఎంతమేరకు ఎరువులు అవసరం అవుతాయి.. దుకాణాల్లో ఎంత మేరకు ఎరువులు నిల్వ ఉన్న విషయం తెలుస్తుంది. ఎరువుల కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టేందుకు అవకాశముంది.

ఎరువుల కొరత లేకుండా..



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఎఫ్ఐవీఎస్ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ఎరువుల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నాం. యాప్ ద్వారా ఏ దుకాణంలో ఏయే ఎరువులు ఎంత మేరకు నిల్వ ఉన్నాయో తెలుస్తుంది. పంటల సాగు సమయంలో కృత్రిమ ఎరువుల కొరత సృష్టించకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– బి.పురుషోత్తం, ఏఓ, కేతేపల్లి

ఆలయాల అభివృద్ధికి కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. నార్కట్‌పల్లి మండల పరిధిలోని అమ్మబోలు గ్రామంలో గల గంగాభవానీ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన శాంతి కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాయ రాజయ్య, ఐటికల మైసయ్య, తవిడిబోయిన భాస్కర్, పర్రె వెంకటపాపయ్య, ఐటికల శ్రీరాములు, ముత్తయ్య, గోపాల కృష్ణ, శ్రీనివాస్, వెంకటయ్య, కృష్ణమూర్తి, ప్రసాద్, లక్ష్మయ్య, బాలజీ, వసంత్, శ్రీహరి, ముత్తయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మనబోలులోని గంగా భవానీ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

ఆలయ కౌలు భూములకు రేపు వేలం

కనగల్: మండల పరిధిలోని ఎం.గౌరారం గ్రామ శివారులోని హాలియా మండలం మారెపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన కౌలు భూములకు సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాట్ నంబర్ 1నుంచి 70వరకు గల 189–33 ఎకరాల భూమికి వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. రైతులు గంట ముందుగా రూ.10,000చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు ఆలయ అధికారి 9959198949 సంప్రదించాలని తెలిపారు.

రాజీ మార్గమే.. రాజమార్గం

- మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి ఆరీఫ్

నకిరేకల్ : రాజీ మార్గమే రాజమార్గమని నకిరేకల్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి ఆరీఫ్ అన్నారు. నకిరేకల్‌లోని మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకుంటే ఇరువైపులా కక్షిదారుల గెలిచినట్లు ఉంటుందన్నారు. ఇలాంటి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 142 క్రిమినల్ కేసులకు రాజీ కుదిర్చారు. మరికొన్ని కేసులకు రూ.1,89,380 జరిమానా విధించారు. మద్యం సేవించినవి, బ్యాంక్ చెక్ బౌండ్స్ కేసులకు సంబంధించి రూ.1,53,500లు రికవరీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు బిచేనపల్లి ప్రకాష్‌రావు, డి.సోమయ్య పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి షేక్ ఆరీఫ్

బదిలీలు, పదోన్నతులు చేపట్టడం సంతోషకరం



మాట్లాడుతున్న సుంకరి భిక్షం గౌడ్

- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్

నల్లగొండ : ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడం సంతోషకరమని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. శనివారం నల్లగొండలోని సంఘం భవన్‌లో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌సీ రెడ్డి, బత్తిని భాస్కర్‌గౌడ్, అద్దంకి సునీల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్‌కు ఇంకా కొన్ని అనుబంధ సవరణలు కూడా చేర్చాలని కోరారు. కట్ ఆఫ్ డేట్‌ను ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించాలన్నారు. వేల మందికి ఒకే రోజు వెబ్ ఆప్షన్స్ ఇవ్వడం కష్టసాధ్యమని, మ్యానువల్ కౌన్సెలింగ్‌గా మార్చాలి కోరారు. కౌన్సెలింగ్ కంటే ముందుగానే ప్రభుత్వము ఇచ్చిన హామీ మేరకు 317 జీఓ బాధితులను వారి సొంత జిల్లాలకు తీసుకుని రావాలని ఆయన కోరారు.

చేపలకు భలే గిరాకీ

మృగశిరకార్తెను పురస్కరించుకుని నకిరేకల్‌లోని మూసీరోడ్డులో గల చేపల మార్కెట్ శనివారం కొనుగోలుదారులతో కిక్కిరిసింది. మార్కెట్‌లో చేపలతో పాటు బాతులు, కుందేళ్లు విక్రయించారు. మృగశిర కార్తె రోజు చేపలను తినాలనే సాంప్రదాయం ఉండడంతో జనం ఎగబడి కొనుగోళ్లు జరిపారు. అదే విధంగా నల్లగొండలోని ప్రధాన రోడ్లపై చేపల విక్రయాలు జోరుగా సాగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నల్లగొండ, నకిరేకల్





నల్లగొండలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు, చేపలను చూపుతున్న బాలిక



నకిరేకల్‌లో కిక్కిరిసిన చేపల మార్కెట్



నల్లగొండలోని పానగల్ రోడ్డులో చేపలను శుభ్రం చేయిస్తున్న ప్రజలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు



చిట్యాల : బడిబాటలో ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి

- చిట్యాల మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. చిట్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించిన తర్వాత ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. భవిత విద్యావనరుల కేంద్రంలో సైతం పలువురు విద్యార్థులను చేర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, హెచ్‌ఎంలు కరుణాకర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అండాలు, ఐఆర్‌టీ ఉపాధ్యాయులు బోయ శ్రీనువాసులు, ఆవుల గీత, ఉపాధ్యాయులు భిక్షపతి, రాధిక, మాధవి, సైదులు, రవీందర్, వనజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

శాలిగౌరారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఆకారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్నాటి శ్రీనివాస్ అన్నారు. 'మన ఊరు–మనబడి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆకారం గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యడవెల్లి అంజయ్య, శివరాత్రి భిక్షమయ్య, కొమ్మనబోయిన శ్రీనయ్య, లక్ష్మి, జవాజి నాగరాజు పాల్గొన్నారు.

కనగల్‌లో..

కనగల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటి తిరిగి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆకారంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కనగల్ మండలం తుర్కపల్లిలో..

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన నాయకులు

చిట్యాల, మునుగోడు: భువనగిరి పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, మునుగోడు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీని పూలమాల, శాలువాతో సన్మానించారు. అభివృద్ధిలో వెనుకబాటుకు గురైన మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, వంగాల యాదగిరిరెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, నాగరాజు ఉన్నారు.



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న భీష్మారెడ్డి



ఎంపీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడల్లో నల్లగొండకు గుర్తింపు తేవాలి

నల్లగొండ రూరల్ : క్రీడాకారులు క్రీడల్లో రాణించి నల్లగొండ జిల్లాకు గుర్తింపు తేవాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ అన్నారు. శనివారం ఎన్‌జీ కాలేజీలో కేకేఆర్ ఫుట్‌బాల్ అకాడమీ, నీలగిరి ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్ టీషర్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కంది కట్ల దాసు, అరవింద్, సునిత, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతిచెందాయి. వివరాలు.. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బొడ్డు నాగయ్యకు చెందిన రెండు గేదెలు శనివారం గ్రామ సమీపంలోని పంటపొలాల్లో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో వర్షం రావడంతో భారీ ఉరుములు, మెరుపులకు విద్యుత్ స్తంభం నుంచి కరెంట్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడే మేత మేస్తున్న రెండు గేదెలు మేత మేసుకుంటూ ఆ కరెంట్ తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ రూ.80 వేలకు పైగా ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.



గేదెల కళేబరాల వద్ద గ్రామస్తులు

మోకాళ్ల లోతు నీటిలో నడక యాతన !

- వానొస్తే సోలిపురం వాసులకు తప్పని వాగు కష్టాలు
- ఏటా వర్షాకాలంలో రాకపోకలు బంద్
- మునుగోడుకు రావాలంటే తప్పని ఐదు కిలోమీటర్ల దూర భారం
- కలగానే మిగిలిన వంతెన నిర్మాణం



మునుగోడు-సోలిపురం గ్రామాల మధ్య రోడ్డుపై పారుతున్న వాగులో వెళ్తున్న రైతు

మునుగోడు : పక్క చిత్రంలో ఓ రైతు మోకాళ్ల లోతు నీటిలో ఎడ్లను తోలుకెళ్తున్న దృశ్యం.. మునుగోడు మండలం సోలిపురం గ్రామానికి వెళ్లే మట్టిదారి. సోలిపురం గ్రామం గాంధీనగర్ చెరువుకు ఆనుకుని ఉంటుంది. ప్రతియేటా వర్షాకాలంలో చెరువులోకి నీరు వచ్చే వాగు ఇలానే మట్టిరోడ్డుపై పారుతుంది. దీంతో మునుగోడు – సోలిపురానికి మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దశాబ్దాలు గడుస్తున్నా సోలిపురం వాసులకు ఇలా వాగు కష్టాలు తీరడం లేదు.

మునుగోడుకు బోడంగిపర్తి మీదుగా..

మునుగోడు మండలం సోలిపురం గ్రామంలో సుమారుగా 500మందికి పైగా జీవనం సాగిస్తున్నారు. వర్షాకాలంలో వాగు నిత్యం పారుతుండడంతో గ్రామస్తులు మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు వీలుండదు. నేటికీ మట్టి రోడ్డు కావడంతో దారి బురదమయంగా మారుతుంది. అడుగుతీసి అడుగు వేయలేనంతగా ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ఆ గ్రామ ప్రజలు నాలుగు కిలో మీటర్ల దూరం ఉన్న మండల కేంద్రానికి చండూరు మండలం బోడంగిపర్తి గ్రామం మీదుగా నడవాల్సి వస్తుంది. అంతే కాకుండా వర్షాకాలంలో గ్రామంలోని వీధులు మురికి కూపాలుగా దర్శనం ఇస్తుంటాయని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.


వంతెన నిర్మాణ పనులు శంకుస్థాపనకే పరిమితం

మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా ప్రచారం చేసేందుకు అప్పటి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, జిల్లా మంత్రి జగదీష్‌రెడ్డి సోలిపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యలను వారికి ఏకరువు పెట్టారు. వెంటనే స్పందించిన వారు గ్రామానికి పక్కా రహదారి ఏర్పాటు చేయడంతో పాటు వాగుపై వంతెన నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికలు ముగిసి ఆరు నెలలు గడిచినా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ గ్రామస్తులు ఆందోళనలు చేపట్టారు. దీంతో 2023వ సంవత్సరం నవంబర్ మాసంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే రెండు నెలల ముందు అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ ఆ పనులు నేటికీ ప్రారంభంలేదు. ఇప్పటికైనా ప్రస్తుత ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సోలిపురం వాగుపై వంతెన నిర్మాణం లేదా తాత్కాలిక వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



మోకాళ్ల లోతు నీటిలో సోలిపురం నుంచి మునుగోడు వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)


తాత్కాలిక వంతెన నిర్మించాలి



వాగులో నీరు నిలిచే చోట గూనలు వేసి తాత్కాలిక వంతెన నిర్మించాలి. వర్షాలు మొదలైన నాటి నుంచి ఎండాకాలం వరకు ఆ రోడ్డు వెంట రాకపోకలు సాగించలేకపోతున్నాం. వాహనాలు ఉన్నవారు మాత్రమే తమ అవసరాలకు ఇతర గ్రామాలకు వెళ్లగలుగుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకసారి ఆలోచించి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– నకరకంటి ప్రభాకర్, సోలిపురం

వర్షం వస్తే రాకపోకలు నిలిచిపోతాయి



సోలిపురం గ్రామం నుంచి మునుగోడుకు వెళ్లే దారిలో వాగు ఉండటంతో వర్షా కాలంలో రాకపోకలు జరపలేక పోతున్నాం. ఆ వాగుపై వంతెన నిర్మించి, బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలి. పలుమార్లు ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులకు విన్నవించాం. గత ఉప ఎన్నికల్లో వంతెన నిర్మిస్తామని అప్పటి మంత్రులు హామీ ఇచ్చి విస్మరించారు.

– గుండెపాక నర్సింహ, సోలిపురం

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ప్రారంభం

నల్లగొండ టౌన్ : ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్ జగినిభీమయ్య, లయన్ రేపాల మదన్‌మోహన్ కోరారు. ఎంజీఎఫ్ లయన్స్‌క్లబ్ నల్లగొండ, చేతన ఫౌండేషన్ కొంగర రామచందర్ రావు కుటుంబ సభ్యులు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారిచే నల్లగొండ పట్టణంలోని పెరుమాళ్ల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక వైద్య పరికరాలతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అత్యంత ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నందున పేదలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆదివారం కూడా శిబిరాన్ని నిర్వహిస్తారని, పట్టణ, ఇతర ప్రాంతాల ప్రజలు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నేతి రఘుపతి, కొంగర రాంచందర్‌రావు, రంగారావు, అలీమొద్దిన్, ఎల్‌వీకుమార్, లయన్ కేవి ప్రసాద్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, డాక్టర్‌పుల్లారావు, అనితారాణి, మండది శంకర్‌రెడ్డి, రాజశేఖర్, చండికేశ్వర్, సత్యనారాయణ, సైదులు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జగిని భీమయ్య, రేపాల మదన్‌మోహన్



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

క్లుప్తంగా

మోదీ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

నల్లగొండ టూటౌన్ : నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు బచ్చన బోయిన సాయిచరణ్ యాదవ్‌కు శనివారం ఆహ్వానం అందింది. ప్రధానమంత్రి ప్రమాణ స్వీకారానికి అతిథిగా హాజరు కావాలని ఆయన కార్యాలయం నుంచి పిలుపువచ్చినట్లు సాయిచరణ్ యాదవ్ తెలిపారు.

కాల్వలో పూడిక తొలగింపు



ఎర్రకుంట వద్ద కాల్వలో పూడికను తొలగిస్తున్న జేసీబీ

నకిరేకల్ : వర్షకాలం నేపథ్యంలో ఇళ్లలోకి వరద నీరు చేరకుండా నకిరేకల్ పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ముందస్తు చర్యలు చేపట్టారు. వార్డు పరిధిలోని సంతోష్‌నగర్‌లో గల ఎర్రకుంట నిండినప్పుడు అలుగు నీరు సాఫీగా వెళ్లేలా కాల్వలో పేరుకుపోయిన పూడికను ,చెత్త చెదారాన్ని జేసీబీతో తొలగించారు.

సదస్సు ప్రచార కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నకిరేకల్ : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉపాధి హామీ చట్ట రక్షణ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య కోరారు. నకిరేకల్‌లో శనివారం ఆ సదస్సు ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. పోరాటల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కత్తుల లింగస్వామి, చింతపల్లి లూర్దు మార్య, గండమల్ల రాములు, మన్నెం భిక్షం, జోగు లక్ష్మయ్య, సాగర్ల నర్సింహ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : వైద్య ఖర్చుల నిమిత్తం పేద కుటుంబానికి శనివారం నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బొమ్మగాని నరేష్ గౌడ్ –మానస దంపతులకు ఏడవ నెలలోనే ఇద్దరు కవలలు జన్మించారు. పుట్టిన ఇద్దరు పిల్లలు కేవలం 850 గ్రాముల బరువు ఉన్నారు. వారికి ఊపిరితిత్తుల ,గుండె తదితర సమస్యలు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కర్నాటి నరేష్, కాసర్ల సురేష్, మందుల శేఖర్ అక్కడికి వెళ్లి ఆ కుటుంబానికి రూ.20,200 సహాయం అందజేశారు.

ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



చిట్యాల ట్రాక్టర్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

చిట్యాల: పట్టణంలోని శ్రీ కనకదుర్గా ట్రాక్టర్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏర్పుల పరమేష్, గౌరవాధ్యక్షుడిగా కోనేటి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఆగు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా సాగర్ల పవన్‌కుమార్, కోశాధికారి పీట్ల దుర్గయ్యతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కూరెళ్ల లింగస్వామి, జిట్ట బొందయ్య, కోనేటి ఎల్లయ్య, జిట్ట రాజయ్య, ఇరగదిండ్ల గణేష్ పాల్గొన్నారు.

కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

చిట్యాల: రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సిక్లిగర్ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సర్దార్ బహదూర్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్‌లు ఖరారు చేయాలని కోరారు.

రామోజీరావు మృతికి సీపీఎం సంతాపం

నల్లగొండ టౌన్ : రామోజీరావు మృతికి సీపీఎం జిల్లా కమిటీ సంతాపాన్ని తెలియజేసింది. శనివారం పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రామోజీరావు పత్రికారంగంలో తనదైన ముద్ర వేసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విశేషపాత్రను పోషించారని ఆయన కొనియాడారు.